క్లుప్తంగా

రూ. పది వేల ఆర్థిక సాయం



ముకుందరావుకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: సరియాబొడ్డపాడుకు చెందిన రోణంకి ముకుందరావు అనారోగ్యంతో మంచం పట్టారు. కాలుకు దెబ్బ తగలడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తపేట హెల్పింగ్‌హేండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అండగా నిలిచారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని ముకుందరావుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఇరాణీ రాజు, జీరు రామకృష్ణ, కిట్టు, బాల, రమణ, రాము, రవి, రాజు,సంతు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న దృశ్యం

సోంపేట: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని ట్రీ ఫౌండేషన్ కన్వీనర్ సోమేశ్వరరావు అన్నారు. జింకిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ట్రీ ఫౌండేషన్ ద్వారా 50 మొక్కలను ఆదివారం నాటారు. విద్యార్థులు మొక్కలను సంరక్షించాలని ప్రధానోపాధ్యాయులు బి.వేణుగోపాలరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తారకేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వితరణ



తాతయ్యకు సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన కాళ్ల తాతయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లు దెబ్బతినడంతో మంచానికి పరిమితమయ్యాడు. దీంతో అతనికి నర్తు రామారావు చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. తాతయ్యను ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. తన ట్రస్టు ద్వారా పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కవిటి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, పార్టీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు ఉన్నారు.

అభినయబోధనతో సులువుగా అవగాహన



అభినయబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా

కవిటి: తెలుగు, హిందీ, ఇంగ్లిష్ వంటి భాషా సబ్జెక్టులను అభినయం ద్వారా బోధించడం ద్వారా విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా అవగాహన చేసుకోగలుగుతారని హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా అన్నారు. కంచిలి మండలం బూరగాంలో పనిచేస్తున్న ఆయన సేవాభావంతో ఆదివారం మండలంలోని ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో వివిధ తరగతుల విద్యార్థులకు పాత్ర వేషధారణలతో అభినయబోధన చేశారు. ఈ సందర్భంగా పిల్లలు ఆయా అంశాలపై అడిగిన సందేహాల్ని నివృత్తి చేశారు.

జోరుగా ఖరీఫ్ పనులు



ఈదుపురంలో పొలం పనులు జరుగుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో పంట పొలాలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. దమ్ములు, నారు మడులు సంరక్షణ, వరినాట్లు వేసే ప్రక్రియలో బిజీబిజీగా గడుపుతున్నారు.

తులసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



డప్పు దరువుకు నృత్యం చేస్తున్న కాళీమాత కళాకారుడు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టి గ్రామంలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ తల్లి సంబరం ఆదివారం అంబరాన్ని తాకింది. చుట్టుపక్కల గ్రామస్తులతో పాటు ఒడిశా నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని భక్తులు కొలిచారు.

ప్రమాద కూడళ్లు!

- హైవేపై కూడళ్లు దాటాలంటే హడల్
- అండర్ పాసేజ్‌లు నిర్మించాలని ప్రజల విజ్ఞప్తి



మకరాంపురం వద్ద ఆదివారం సంత కూడలి

కంచిలి: జాతీయ రహదారులపై ఉన్న ప్రధాన కూడళ్లు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసిన నాటి నుంచి ఆ కూడళ్లలో ప్రమాదాలకు కొదవలేకుండా పోయింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో రద్దీగా ఉండే కూడళ్లలో అండర్ పాసేజ్‌లను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతీయులు కూడా ఆయా చోట్ల అండర్ పాసేజ్‌లు కావాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో జాతీయ రహదారిపై బిజీగా ఉండే జంక్షన్లు పరిశీలిస్తే.. కంచిలి మండల పరిధిలో మకరాంపురం ఆదివారం సంత కూడలి, భైరిపురం జంక్షన్, కంచిలి బైపాస్‌లో బలియాపుట్టుగ, జలంత్రకోట, బూరగాం జంక్షన్లు, సోంపేట మండలం బేసి రామచంద్రాపురం జంక్షన్, ఇచ్ఛాపురం బైపాస్‌లో ఈదుపురం నుంచి వాహనాలు వచ్చే బెల్లుపడ జంక్షన్లు ప్రమాదాలకు కూడళ్లుగా మారాయి. ఈ కూడళ్ల నుంచి రోజూ వందలాది వాహనాలు రోడ్లను క్రాస్ చేసి రాకపోకలు సాగిస్తుంటాయి. ఆయా చోట్ల అండర్ పాసేజ్ మార్గాలకు వీలుగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మకరాంపురం దరి ఆదివారం సంత కూడలి మీదుగా కంచిలి, కవిటి మండలాల పరిధిలో ఉద్దానం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుండగా, మరోవైపు సరిహద్దు ఒడిశా గ్రామాలకు చెందిన ప్రజలు జక్కర, కేసరపడ వైపు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇక కంచిలి బైపాస్ పరిధిలో బలియాపుట్టుగ, పాత్రపడ, చిన్నపాత్రపడ గ్రామాల ప్రజలు మండల కేంద్రం కంచిలికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇక బూరగాం గ్రామం వద్ద కూడలి మీదుగా వివిధ మండలాలకు చెందిన ప్రజలు సోంపేట వెళ్తుంటారు. జలంత్రకోట కూడలి వద్ద కంచిలి, సోంపేట మండలాల ప్రజలతోపాటు, అక్కడ ఉన్న క్వారీలకు పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. భైరిపురం, బేసి రామచంద్రాపురం కూడళ్ల వద్ద కూడా తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. ఇప్పటికే మకరాంపురం వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంతీయులు పలుసార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అక్కడ చేపట్టిన సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని కూడా నిరసనకారులు అడ్డుకున్నారు. ఇలా ఈ కూడళ్లలో ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌ల కోసం ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని జాతీయ రహదారుల సంస్థ అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బలియాపుట్టుగ గ్రామ కూడలి



ప్రమాదకరంగా ఉన్న జలంత్రకోట కూడలి

సంత కూడలిలో ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి



కంచిలి మండల పరిధిలో ఆదివారం సంత కూడలి మకరాంపురం గ్రామం వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి. ఈ జంక్షన్ మీదుగా రెండు మండలాల ఉద్దానం గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోనే పెద్ద సంతగా పేరు ఉండడంతో ఆదివారం సంతకు వేలాది మంది రైతులు వారి పండించిన ఉత్పత్తులు తీసుకొచ్చి అమ్మకాలు సాగించడం, వ్యాపారులు సరకులు అమ్మడం వంటి లావాదేవీలు చేస్తుంటారు. ఇక్కడి ప్రాధాన్యతను గుర్తించి అధికార యంత్రాంగం ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

–బెందాళం రమణసాయి, షిర్డీసాయి ఆలయ ధర్మకర్త, మకరాంపురం, కంచిలి మండలం

జంక్షన్లతో ప్రమాదాలు



కంచిలి మండలంలో ఆదివారం సంత కూడలితోపాటు మిగతా జంక్షన్లలో రోజూ ఏదోఒక ప్రమాదం చోటుచేసుకుంటుంది. చాలామంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. వాటిలో మొదటిస్థానంలో ఆదివారం సంత కూడలి వస్తుందని చెప్పాలి. ఇక్కడ ఉద్దానం ప్రాంతాలతోపాటు, ఒడిశా గ్రామాల ప్రజలు కూడా ఈ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడి అవసరాన్ని గుర్తించి, మిగతా చోట్ల కూడా ఓవర్‌బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లు నిర్మించాల్సిన అవసరం ఉంది.

–కప్పల యుగంధర్, రైతు, కేసరపడ, కంచిలి మండలం

అందరూ ఐకమత్యంగా మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు



అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సభ్యులు

- సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఏ ప్రభుత్వం ఉన్నా అధికారులు పద్ధతిగా మెలగాలి
- సూపర్ సిక్స్ పథకాలను కూటమి సర్కార్ అమలు చేయాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు

వజ్రపుకొత్తూరు: ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ఐకమత్యంగా మెలగాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ప్రభుత్వాలు మారినా అధికారులు శాశ్వతంగా ఉంటారని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకుని అధికారులు సర్పంచ్ ఎంపీటీసీ సభ్యులను కలుపుకుని అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేయాలని కోరారు. వజ్రపుకొత్తూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా ఎంపీపీ నీలవేణి అధ్యక్షోపన్యాసం చేశారు. అధికారులు సభ్యులకు కనీస గౌరవం ఇవ్వడంలేదని, ప్రోటోకాల్ పాటించకుంటే ఊరుకునేది లేదని సభ్యులు అధికారులకు అల్టిమేటం ఇచ్చారు. అధికారులు అలా చేయకుంటే చర్యల కోసం తీర్మానం చేయాలంటూ కొత్తపేట, సైనూరు సర్పంచ్‌లు అంబటి శ్రీను, అట్టాడ గోవిందరావులు డిమాండ్ చేశారు. తాము అభివృద్ధి పనులకు సహకరిస్తామని చెప్పినా కలుపుకొని పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా చేస్తే మా సహకారం లేకుండా మీరు ముందుకు పోగలరా అని ఎంపీపీ నీలవేణి అధికారులను నిలదీయడంతో ఎమ్మెల్సీ పైవ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థల్లో సమూల మార్పులు తీసుకొచ్చి అమలు చేశామన్నారు. పౌష్టిక ఆహారం నుంచి నాడు–నేడు పనులతో నాణ్యమైన విద్య అందించామన్నారు. విద్యతోనే పేదరికం నిర్మూలన సాధ్యమని భావించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలు తీసుకొచ్చారని ఎమ్మెల్సీ అన్నారు. తాము అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే పథకాలు అందించామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పద్ధతిగా మెలిగి అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను కలుపుకొని పోయి కచ్చితంగా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యుత్, మత్స్య శాఖలపై గరం గరం

పలు విషయాలపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఏఈఈ ఎల్.యోగి పనితీరుపై కొత్తపేట, సైనూరు, పాతటెక్కలి, కొమరల్తాడ సర్పంచ్‌లు ఎ.శ్రీను, ఎ.గోవిందరావు, చింతరాజులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్రేక్ డౌన్, లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, తదితర పనుల కోసం సర్పంచ్‌లు ఫోన్ చేసినా ఏఈఈ యోగి స్పందించడం లేదని సభ్యులు మండి పడ్డారు. సమావేశానికి రాకపోవడంపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఏఈఈ సమావేశానికి రాకపోవడంపై ఎంపీపీ నీలవేణి కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్య శాఖలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని, మత్స్యకార భరోసా ఈ ఏడాది ఇవ్వలేమని ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో తేల్చి చెప్పగా సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మత్స్యశాఖ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న మత్స్యకారుల పేర్లను ఎలా తొలగిస్తారని కేఆర్‌పేట సర్పంచ్ వంక చిరంజీవి ఎఫ్‌డీవోను నిదీశారు. కూటమి ప్రభుత్వం చెప్పినట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఎంపీడీవో డిక్కల తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయకుమార్, వైస్ ఎంపీపీలు వంక రాజు, తమ్మినేని శ్రావణి, మండల విప్ తిర్రి గుణ, పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశవరావు, దున్న బాలరాజు, ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, ఐసీడీఎస్ పీవో లావణ్య పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



అనురాధ బిసాయికి సాయం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన అనురాధ బిసాయి మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. ఈమె భర్త మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వీరిలో ఒకరు మూగ. ఈ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. విషయాన్ని తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి క్లబ్ సభ్యులు ఔదార్యాన్ని చాటుకున్నారు. పది వేల రూపాయలను అనురాధ బిసాయికి ఆదివారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు భీమరాజు, మన్మథరావు, సూరు రమేష్, నరేంద్ర, ప్రకాష్ ఉన్నారు.

నేడు కళింగదళ్ నీటి విడుదల

కాశీబుగ్గ: మందస మండలం కళింగదళ్ రిజర్వాయర్ నుంచి దిగువ రైతులకు నీటిని సోమవారం విడుదల చేయనున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదలైంది. ఉదయం పదిన్నర గంటలకు ఎమ్మెల్యే శిరీష పూజలు చేసి నీటిని విడుదల చేయనున్నారు.

శాకంబరిగా లలితాదేవి



లలితాదేవి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని మొండేటి వీధిలో లలితా సమేత శివకామేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ మాసం సందర్భంగా లలితాదేవి ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. షిరిడీసాయి సేవా సంఘం, అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అనంతరం లలితా సహస్రపారాయణ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ మోటార్ చోరీ



దొంగతనానికి గురైన ప్రాంతం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులోని నిర్మాణంలో ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. పట్టణానికి చెందని కొర్ల డిల్లీశ్వరరావు పలాస మదర్‌థెరిసా పాఠశాలలో రెండంతస్తుల భవనాన్ని నిర్మించికుంటున్నారు. ఇందులో భాగంగా 310 అడుగుల లోతులో ఇటీవల బోర్‌వేసి మోటారు బిగించారు. అయితే మొటారుకు చెందిన పైపులు, వైర్లను కోసేసి అవసరమైన విద్యుత్ పరికరాలతో పాటు మోటారు, ప్యానెల్ బోర్డులను దొంగిలించుకుపోయారు. రూ.70 వేల విలువైన సామగ్రి పోయినట్లు బాధితుడు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న హారికా ప్రసాద్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): చదువుకు పేదరికం అడ్డుకాకూడదని హర్షవల్లి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ హారికా ప్రసాద్ అన్నారు. నగరంలోని క్లబ్ కార్యాలయంలో పలువురు పేద విద్యార్థులకు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎటువంటి సహాయం కావాలన్నా క్లబ్ తరఫున సహాయం అందజేస్తామన్నారు.

నవయుగ వైతాళికుడు జాషువా



మోహనరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నవయుగ వైతాళికుడు గుర్రం జాషువా కవి అని వక్త మందుల మోహనరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఉపనిషన్మందిరంలో గుర్రం జాషువా కవితా వైభవంపై ప్రసంగం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ జాషువా భావకవిత్వం నుంచి సామాజిక ప్రయోజనం చేకూర్చే రచనలు చేశారని చెప్పారు. పిరదౌసి, గబ్బిలం, సత్యహరిశ్చంద్ర రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పి.పతంజలిశాస్త్రి, బి.కోమలరావు, బి.మల్లేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, బాబూరావు, సంగమేశ్వరరావు, ఈశ్వరరావు, పి.వి.ఎస్.ప్రసాద్, సరస్వతి, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఆరోగ్య కూరలు..



కాశీబుగ్గ మార్కెట్‌లో అమ్మకంలో తూటికూర, పొన్నగంటికూర, శేషురేసు కూరలు

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి నిత్యం అందుబాటులో ఉండే తోటకూర, గోంగూర అనుకుంటే తప్పులో కాలేసినట్టే. మన పూర్వీకులు వారానికి ఒక్కసారైనా ఆరోగ్యం కోసం తినే తూటికూర, పొన్నగంటికూర, శేషురేసు కూర, అంబలామడు, బోదండం, బలుసాకు కూరలు. కొండకోనలు, పొలం గట్లపై మాత్రమే ఇవి లభిస్తాయి. వీటిలో ఆరోగ్యాన్నిచ్చే పోషకాహారాలు అధికంగా ఉంటాయి. అందుకే వీటిని తినేందుకు చాలామంది ఇష్టపడతారు. మారుమూల, గిరిజన ప్రాంతాలకు పరిమితమైన ఈ కూరలు ఇప్పుడు కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో దొరుకుతున్నాయి. కొంతమంది మహిళలు వీటిని సేకరించి.. తీసుకొని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. వేకువజామున వ్యాయామానికి వచ్చే వారంతా వీటిని కొనుగోలు చేస్తున్నారు. ధర కూడా అందుబాటులోనే ఉంటుంది. ఏ కూర కట్టైనా పది రూపాయలే.

–కాశీబుగ్గ

దేశీయ కొబ్బరిపై ఉపాధ్యాయుడు ప్రచారం



పాఠశాల ఆవరణలో దేశీయ కొబ్బరి మొక్క నాటుతున్న ఉపాధ్యాయుడు పురుషోత్తం

కాశీబుగ్గ: హైబ్రీడ్ కంటే దేశీయ కొబ్బరి మొక్కలనే నాటాలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జుత్తు పురుషోత్తం అన్నారు. మంచి దిగుబడి ఇచ్చిన మొక్కల నుంచి విత్తనాలను సేకరించి వాటిని మొక్కలుగా తయారీచేసి కొంతమంది నిరుపేద రైతులకు బహుమతిగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్దాన ప్రాంతానికి తరచూ తుఫాన్ ప్రమాదాలు ఉన్న నేపథ్యంలో చాలామంది తక్కువ సమయంలో పంటచేతికి అందే హైబ్రీడ్ కొబ్బరి మొక్కలను పెంచుతున్నారని అన్నారు. అటువంటి చెట్టు నుంచి వచ్చిన కొబ్బరిబొండాం రుచి వేరేగా ఉంటుందని అన్నారు. పూర్వీకులు నుంచి ఉద్దానంలో పుట్టిపెరిగిన దేశీయ కొబ్బరిచెట్టు పంటపండి ఫలసాయం ఆలసమైన బొండాల రుచి కమ్మగా ఉంటుందని అన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏస్) ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారి తాతారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఇల్లీసుపురం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిరరం వేదికగా బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం సంఘ జిల్లా అధ్యక్షులు పేకేటి రామారావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అలికాన ఆనందు, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలన్నారు. జీవో 117ను తక్షణం రద్దుచేసి, ప్రాథమిక పాఠశాల విద్యను కాపాడాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్సీకి ముందు ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయ పదోన్నతులను కల్పించాలని విన్నవించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఎస్ఎస్ మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తందాడి అనిల్ కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు, విజయనగరం జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ, శ్రీకాకుళం జిల్లా కోశాధికారి దుర్యోధనరావు, మహిళా కార్యదర్శి రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళింగ కులస్తుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కాళింగజాతి అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీపాన వెంకటరమణ అన్నారు. వివిధ జిల్లాలకు చెందిన కాళింగ యువత, నాయకులతో ఆదివారం విశాఖపట్నంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ప్రసంగిస్తూ కళింగ జాతి మొత్తం ఏకతాటిపైకి రావాలని, త్వరలో ఓ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని సంఘ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర కళింగ యూత్ ప్రెసిడెంట్ పొందూరు ఉమేశ్వరరావు, ఉత్తరాంధ్ర యూత్ ఇన్‌చార్జి అన్నెపు సంతోష్‌కుమార్, శ్రీకాకుళం యూత్ ప్రెసిడెంట్ పప్పల వేణుమాధవ్, చింతాడ సాయికుమార్, బెండి నారాయణరావు, ఎండ బాబురావు, కిల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



ధ్రువీకరణ పత్రాలతో రక్తదాతలు

శ్రీకాకుళం అర్బన్ : రక్తదానం మహాదానమని, రక్తం కొరత లేని జిల్లాగా శ్రీకాకుళం జిల్లాను తీర్చిదిద్దుకోవాలని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడు కె.చెన్నకేశవరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరానికి చెందిన న్యూ ఆదిత్య వాకింగ్, జుంబా డ్యాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పీఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కూడా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. మూడు నెలలకోసారి రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉండడంతో పాటు ప్రాణదాతలమవుతామని పేర్కొన్నారు. రక్తం అందక ఎంతోమంది చనిపోతున్నారని, దేశంలో ప్రతి రెండు సెకన్లకు ఒకరికి రక్తం అవసరమవుతుందని చెప్పారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్ మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ వైద్యులు పరీక్షలు చేసి పూర్తి ఆరోగ్యవంతులని, సరిపోయినంత రక్తం ఉందని నిర్ధారించుకున్న తర్వాతే రక్తం సేకరిస్తారని చెప్పారు. రక్తదానం చేశాక ఆరు నుంచి పన్నెండు వారాలలోపు వ్యక్తికి పూర్తి స్థాయిలో కొత్త రక్తం తయారవుతుందని వివరించారు. అనంతరం 107 మంది రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.

ఐకమత్యంతోనే జాతి అభ్యున్నతి



చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నూతన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఐకమత్యంతోనే జాతి జాగృతి పెరుగుతుందని, చాత్తాద శ్రీవైష్ణవ సామాజికవర్గ ప్రజలందరూ ఐకమత్యంతో మెలగాలని సినీ నిర్మాత కంచర్ల అప్పారావు ఆకాంక్షించారు. శ్రీకాకుళం నగరంలోని చిన్న బజార్‌రోడ్‌లో ఉన్న వాసవి కల్యాణ మండపంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘ జిల్లా, పట్టణ సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చాత్తాద శ్రీవైష్ణవుల జనాభా 30 వేల మంది మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వాలు చెబుతున్నాయని, గత 30 ఏళ్ల లెక్కలను ఇప్పటికీ చూపుతూ తమ సామాజిక వర్గానికి వెనక్కి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సామాజికవర్గ ప్రజలు మూడు లక్షల మందికి పైగానే ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వం తమ సామాజికవర్గానికి కార్పొరేషన్‌గా గుర్తించారన్నారు. ఈసారి ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచే కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షునిగా ఆలవెల్లి తిరుమలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శోభన్ బాబు, శ్రీకాకుళం పట్టణ అధ్యక్షుడిగా తాళ్లూరి నవీన్, ప్రధాన కార్యదర్శిగా కోవెలకొండ కుమార్, కార్యవర్గ ప్రతినిధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి శంకర్, కొర్ను నాగార్జున ప్రతాప్,రెడ్డి గిరిజాశంకర్,బసవ నాని పాల్గొన్నారు.